నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
5 | నిజామాబాద్, శుక్రవారం 16 ఫిబ్రవరి 2024 | ADILABAD

రాస్తారోకోను సక్సెస్ చేయండి..

మాట్లాడుతున్న సీపీఐ(ఎంఎల్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు

భైంసా టౌన్, ఫిబ్రవరి 15 : రైతాంగ సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా చేపడుతున్న గ్రామీణ భారత్ బంద్‌లో భాగంగా దేగాంలో నిర్వహించే రాస్తారోకోను రైతులు పాల్గొని విజయవంతం చేయాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు కోరారు. గురువారం దేగాం, ఇలేగాం, వాలేగాం గ్రామాల్లో కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కనీస మద్దతు ధర చట్టం, స్వామినాథన్ సిఫార్సుల అమలు, రైతు రుణమాఫీ, రైతు కూలీల పెన్షన్, రైతు వ్యతిరేక చట్టాల రద్దు వంటి సమస్యలను పరిష్కరించే వరకు పోరాడుతామన్నారు. రైతులు అధిక సంఖ్యలో పాల్గొని బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గంగాధర్, ముత్తన్న, జిల్లా కార్యదర్శి మహేందర్ పాల్గొన్నారు.

సేవాలాల్ బోధనలను ఆచరించాలి..

సేవాలాల్ చిత్రపటం వద్ద జ్యోతి ప్రజ్వలన చేస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

ఖానాపూర్ టౌన్, ఫిబ్రవరి 15 : యువత సంత్ సేవాలాల్ మహారాజ్ బోధనలను ఆచరించి జీవితంలో ఉన్నతస్థాయికి ఎదగాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ సూచించారు. గురువారం పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో రవీందర్‌రెడ్డి, తహసీల్దార్ భౌమిక్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

ఘనంగా సేవాలాల్ జయంతి

ఇచ్చోడ, ఫిబ్రవరి 15 : సంత్ సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ హాజరయ్యారు. అనంతరం మండల నాయకులతో కలిసి సేవాలాల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంజారా జాతి పునర్జీవానికి కృషి చేసిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రీతంరెడ్డి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ కృష్ణా రెడ్డి పాల్గొన్నారు.

బోథ్ మండల కేంద్రంలో..

బోథ్, ఫిబ్రవరి 15 : శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో బంజారాలు నడవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. సేవాలాల్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బంజారాల ఆచారాలు, జీవన విధానాన్ని సేవాలాల్ మనకు చూపించారన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ సంధ్యారాణి, బీఆర్ఎస్ మండల కన్వీనర్ డి నారాయణరెడ్డి, ఆడె గజేందర్, లింబాజీ, వసంత్‌రావు, సకారాం, పరుశురాం, విఠల్, రామారావు, సుభాష్‌నాయక్, మాన్‌సింగ్ మహారాజ్, తదితరులు పాల్గొన్నారు.

బాధితుల వివరాలను గోప్యంగా ఉంచాలి..

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌష్ ఆలం

ఎదులాపురం, ఫిబ్రవరి 15 : పోక్సో కేసు నమోదైన బాధితుల వివరాల(పేరు, ఊరు, తల్లిదండ్రులు, పాఠశాల)ను బహిర్గతం చేయరాదని ఎస్పీ గౌష్ ఆలం పోలీసు అధికారులకు సూచించారు. గురువారం జిల్లా పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో ఆదిలాబాద్ సబ్ డివిజనల్ అధికారులతో నేర సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శిక్ష శాతం పెరగాలంటే కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. అత్యాచార, దీర్ఘకాలిక కేసులు, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, మహిళలపై జరుగుతున్న నేరాలు, గంజాయి కేసులు ప్రస్తుతం ఏ స్థితిలో ఉన్నాయనే అంశాలపై చర్చించామన్నారు. కీలకమైన కేసుల్లో సాక్ష్యాధారాలను సేకరించి నిందితులకు శిక్ష పడే విధంగా కృషి చేయాలన్నారు. సైబర్ నేరస్తులు అవలంబిస్తున్న పద్ధతులపై అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఎస్పీ శ్రీనివాస్, సీఐలు కే.సత్యనారాయణ, సైదారావు, డి.సాయినాథ్, ఆర్ఐ సీఐ మురళి, నవీన్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

క్రీడల్లోనూ రాణించాలి..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : చదువుతోపాటు పిల్లలు క్రీడల్లోనూ రాణించాలని ఎస్పీ గౌష్ ఆలం అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని బ్రాహ్మణవాడలో గల మహ్మదీయ ఉర్దూ పాఠశాలలో నిర్వహించిన సైన్స్ ఎగ్జిబిషన్‌కు ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులకు మార్గదర్శనం చేశారు. మొదటగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎగ్జిబిషన్‌లో గెలుపొందడం ముఖ్యం కాదు.. పాల్గొనడం ప్రధానమని సూచించారు. అనంతరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన నలుగురు విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. కౌన్సిలర్ దొడ్డన్న, పాఠశాల ప్రిన్సిపాల్ జాఫర్ ఖాన్ పాల్గొన్నారు.

బహుమతులు, ప్రశంసాపత్రాలను అందుకున్న వారితో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్

మీకు మీరే సేఫ్టీ అంబాసిడర్ కావాలి..

● జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్
● వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతుల ప్రదానం

కుంటాల, ఫిబ్రవరి 15 : విద్యార్థులు తమ కుటుంబానికి తామే రోడ్ సేఫ్టీ అంబాసిడర్ కావాలని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. గురువారం ఏఎస్పీ కుంటాల మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో జరిగిన జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల్లో పాల్గొని విద్యార్థులకు పలు సూచనలు చేశారు. తమ కుటుంబంలోని పెద్దలకు రోడ్ సేఫ్టీపై అవగాహన కల్పించాలని కోరారు. డ్రంక్ అండ్ డ్రైవ్ వల్ల కలిగే నష్టాలు, హెల్మెట్ ప్రాధాన్యతను వివరించాలని సూచించారు. రోడ్డు క్రాస్ చేసేటప్పుడు, బస్సును క్యాచ్ చేసేటప్పుడు జాగ్రత్తలు పాటించాలన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ఇతర చెకింగ్‌లు ప్రజల భద్రత కోసమేనని, వాహనదారులు సహకరించాలని కోరారు. కుంటాల ఎస్ఐ హన్మండ్లు ఆధ్వర్యంలో రోడ్డు భద్రత, ట్రాఫిక్ రూల్స్‌పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. దీనికి ముందు పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, తహసీల్దార్ అహ్మద్ ఖాన్, హెచ్ఎంలు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సీసీఐ షాక్

తేమ పేరిట పత్తి కొనుగోళ్లకు నిరాకరణ

● రోజుల తరబడి నిరీక్షిస్తున్న అన్నదాతలు ● ధర తగ్గించి కొనద్దని వేడుకోలు ● దళారుల దందాతో నష్టపోతున్నాం..
● సీసీఐ అధికారులను వేడుకుంటున్న రైతన్నలు ● ఉన్నతాధికారులు న్యాయం చేయాలి

ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో బారులుదీరిన పత్తి వాహనాలు

పత్తిని ఆరబెడుతున్న రైతులు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 15(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సీసీఐ) అధికారుల తీరు రైతుల పాలిట శాపంగా మారింది. తేమ పేరిట పత్తిని కొనుగోలు చేయడానికి నిరాకరిస్తున్నారు. ఆరబెట్టుకుని తీసుకురమ్మంటున్నారు. రైతన్నలు బతిమిలాడినా కనికరించడం లేదు. దళారులు తీసుకొచ్చిన పత్తిని తేమ చూడకుండా కొనుగోలు చేస్తున్నారని, తాము కష్టపడి పండించి తీసుకొస్తే కొనుగోలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాంబెన్.. కాల్మొక్తాం కొనండని దీనంగా వేడుకుంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,020 పెట్టి కొనుగోలు చేయడం లేదు. నాణ్యత సరిగా లేదంటూ క్వింటాలుకు రూ.100 తగ్గించి రూ.6,920తో కొంటున్నారు. ఫలితంగా జిల్లా వ్యాప్తంగా రైతులు రోజుకు రూ.15 లక్షల వరకు నష్టపోవాల్సి వస్తున్నది. రైతన్నలు చేసేది లేక ప్రైవేటు వ్యాపారులకు రూ.6,500 చొప్పున విక్రయించి, క్వింటాలుకు రూ.420 నష్టపోతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డులో కొనుగోళ్లు సక్రమంగా నిర్వహించాలని రైతులు ఆందోళన చేపట్టినా ఫలితం లేదు.

దళారుల దందాపై అనుమానం

రైతులు అధికంగా ట్రాక్టర్లు, మాక్స్ వాహనాలు, ఆటో ట్రాలీల్లో పత్తిని విక్రయించడానికి ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొస్తారు. ఒకేసారి 20-25 క్వింటాళ్ల వరకు తెచ్చి అమ్ముకుంటారు. ఇలా పలు విడుతలుగా తీసుకొచ్చి విక్రయిస్తారు. కాగా.. కొన్ని రోజులుగా దళారులు రైతుల పేరిట పత్తిని ఐచర్ వాహనాల్లో తీసుకొస్తున్నారు. ఒక్కో వాహనంలో 80-100 క్వింటాళ్ల వరకు తెస్తున్నారు. దళారులు రైతుల వద్ద తక్కువ ధరకు సేకరించి, వారి పేరిట అధిక ధరకు సీసీఐకి విక్రయించి లాభాలు గడిస్తున్నారు. భారీ వాహనాల విషయంలో ఆదిలాబాద్ మార్కెట్ అధికారులను వివరణ కోరగా కౌలు రైతులు భారీ వాహనాల్లో పంటను తీసుకొస్తున్నారని తెలిపారు. వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌ల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా పంటను సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. దళారులు తీసుకొచ్చిన పత్తిని మాత్రమే కొనుగోలు చేస్తూ.. తమ పంటను తిరస్కరిస్తున్నారని గత మంగళవారం రైతులు ఆందోళన నిర్వహించారు. ఉన్నతాధికారులు స్పందించాలనిరైతులు కోరుతున్నారు.

దళారుల పత్తినే కొంటున్నారు..

సీసీఐ అధికారులు దళారులు తెచ్చిన పత్తిని కొనుగోలు చేస్తూ.. మేము తెచ్చిన పత్తిని కొంటలేరు. తేమ పేరిట ఇబ్బందులు పెడుతున్నారు. నేను మంగళవారం 9 గంటలకు పత్తిని తెచ్చిన. సాయంత్రం 5 గంటల వరకు కూడా కొనలేదు. కొనాలని అధికారులను బతిలాడినా ఫలితం లేకుండా పోయింది. దీంతో చేసేది లేక 18 క్వింటాళ్ల పత్తిని రూ.5,500లతో ప్రైవేటు వ్యాపారులకు విక్రయించా. సీసీఐ అధికారుల నిర్వాకం ఫలితంగా నాకు రూ.25 వేల నష్టం వచ్చింది.
- అశోక్, రైతు, అంతర్గాం, భీంపూర్, ఆదిలాబాద్

ఇప్పటికీ వాహన కిరాయే రూ.10 వేలు అయింది..

పై ఫొటోలో కనిపిస్తున్న రైతు తాంసి మండలంలోని కప్పర్లకు చెందిన గండ్రత్ సంతోష్. 18 క్వింటాళ్ల పత్తిని విక్రయించడానికి మంగళవారం ఉదయం ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు తీసుకొచ్చాడు. తేమ శాతాన్ని పరిశీలించిన సీసీఐ సిబ్బంది 14 శాతం ఉందని నిర్ధారించారు. కాంటా చేసి అన్‌లోడ్ కోసం జిన్నింగ్‌కు పంపించారు. అక్కడా మరోసారి తేమ శాతం కొలిచారు. తేమ ఎక్కువగా ఉందంటూ అన్‌లోడ్ చేయకుండా తిరిగి వెళ్లాలని సూచించారు. దీంతో మార్కెట్ యార్డుకు వచ్చిన రైతు అధికారులను సంప్రదించగా పంటను ఆరబెట్టుకుని తీసుకురావాలని సూచించాడు. మూడు రోజులుగా మార్కెట్ యార్డులో పత్తిని ఆరబెడుతున్నాడు. దళారులు తీసుకొచ్చిన పత్తిలో తేమ శాతం ఎక్కువగా ఉన్నా సీసీఐ సిబ్బంది అన్‌లోడ్ చేశారని, తన పత్తిని మాత్రం తిరస్కరించారని సంతోష్ ఆవేదన వ్యక్తం చేశాడు. మూడు రోజుల వాహనం కిరాయి రోజుకు రూ.2 వేల చొప్పున రూ.6 వేలు, పత్తి అన్‌లోడింగ్, లోడింగ్‌కు రూ.3,750 చెల్లించాల్సి వస్తుందని, దాదాపు రూ.10 వేల వరకు నష్టం వాటిల్లిందని కన్నీరు పెడుతూ చెప్పాడు. ఇప్పటివరకు కొనలేదని ఎన్ని రోజులు పడుతుందో తెలియదని చెప్పాడు.

అదనపు కలెక్టర్ ఆగ్రహం

● మహాగాంలో ఆకస్మికంగా పర్యటన ● అధికారులు అందుబాటులో లేకపోవడంపై అసంతృప్తి
● జడ్పీ స్కూల్, పీహెచ్‌సీ, జీపీ రికార్డుల పరిశీలన

మహాగాంలో సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

భైంసా టౌన్, ఫిబ్రవరి 15 : నిర్మల్ జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ గురువారం మహాగాంలో ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ముందుగా జడ్పీ పాఠశాలకు చేరుకుని పదో తరగతి ప్రత్యేక తరగతులపై ఆరా తీశారు. ఫిజిక్స్ బోధించే ఉపాధ్యాయుడు సాయరెడ్డి ప్రత్యేక తరగతులు తీసుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధ్యాయుడు ప్రత్యేక తరగతులు తీసుకోకపోవడంపై వివరణ ఇచ్చాడు. అనంతరం పీహెచ్‌సీని తనిఖీ చేయగా ఒక్కరు కూడా విధుల్లో లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వోకు ఫోన్ చేసి సంబంధిత వైద్యులు, సిబ్బందికి నోటీసులు జారీ చేయాలని సూచించారు. ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ ఆసుపత్రికి రాకపోవడం, డ్యూటీ డాక్టర్ సమయాని కంటే ముందే వెళ్లిపోవడంపై వివరణ కోరారు. రోజు వైద్యులు, సిబ్బంది మధ్యాహ్నం వరకు మాత్రమే విధులు నిర్వహించి వెళ్లిపోతున్నారని గ్రామస్తులు ఆరోపించారు. పరీక్ష రిపోర్టులు ఇవ్వడం లేదని, మెస్సేజ్‌లు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫార్మాసిస్ట్ కూడా అందుబాటులో ఉండడం లేదని, ఇన్‌చార్జి మెడికల్ ఆఫీసర్ శృతి వారంలో కనీసం రెండు రోజులు అందుబాటులో ఉండి మీటింగ్‌లు తీసుకోవాలని సూచించారు. టీటీ ఇంజిక్షన్, సెలైన్ బాటిళ్లు, మందులను అందుబాటులో ఉంచాలని సూచించారు. అక్కడి నుంచి సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించగా.. నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. క్రీడా ప్రాంగణం, నర్సరీల నిర్వాహణ బాగుందన్నారు. అక్కడి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయానికి చేరుకుని రికార్డులను పరిశీలించారు. నిర్వహణ సరిగ్గా లేకపోవడంతో కార్యదర్శి ప్రవీణ్‌కు షోకాజు నోటీసు జారీ చేయాలని ఎంపీవోకు సూచించారు. ఎన్నికల కంటే ముందు ఇన్‌చార్జి కార్యదర్శిగా పనిచేసిన చింతల్‌బోరి కార్యదర్శి గోవింద్ రిజిస్టర్‌లోని ఖాళీ పేజీల్లో సంతకాలు చేయడంపై వివరణ ఇవ్వాలని ఎంపీవోకు సూచించారు. ఆయన వెంట ఏపీవో శిలింగం, హెచ్ఈవో సలీం ఉన్నారు.


మహాగాం జడ్పీ స్కూల్ ఉపాధ్యాయుడు సాయరెడ్డిని వివరణ కోరుతున్న అదనపు కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

మహిళలు మనోధైర్యంతో ముందుకెళ్లాలి..

నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

కడెం, ఫిబ్రవరి 15 : మహిళలు అన్ని రంగాల్లో ముందుండి మనోధైర్యంతో ముందుకెళ్లాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. స్వచ్ఛత వారోత్సవాల్లో భాగంగా అల్లంపెల్లిలో గురువారం నిర్వహించిన మిషన్ రేలా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని స్వయం సహకార సంఘాల సహాయంతో స్థానికంగా తయారు చేసిన శానిటరీ ప్యాడ్ల మిషన్ రేలా పేరిట ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ మహిళలు మహిళా సాధికారత సాధించడానికి అన్ని రంగాల్లో పోటీ పడాలని పేర్కొన్నారు. స్థానికంగా తయారు చేసిన శానిటరీ ప్యాడ్లు తక్కువ ధరకు లభిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీవో పీడీ విజయలక్ష్మి, ఎంపీడీవో అరుణ, ఎంపీవో రత్నాకర్, సీడీపీవో సరిత, ఏపీవో జయదేవ్, ఏపీఎం రాజారాం పాల్గొన్నారు.

చదువుతోపాటు క్రీడలు ముఖ్యమే..

ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 15 : విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం సాయంత్రం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లా బాక్సింగ్ ఛాంపియన్ షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అత్యుత్తమ శిక్షణలు అందించి క్రీడారంగాల్లో రాణించేలా విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈనెల 21, 22వ తేదీల్లో హైదరాబాద్‌లో జరిగే పోటీలకు జిల్లాస్థాయి పోటీల్లో గెలుపొందిన వారిని ఎంపిక చేసి పంపిస్తామన్నారు. ఈ సందర్భంగా పాల్గొన్న క్రీడాకారులకు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఖేలో ఇండియా సౌత్ జోన్ నేషనల్ బాక్సింగ్ ఛాంపియన్ షిప్‌లో గోల్డ్ మెడల్ సాధించిన అబ్దుల్ అఫియజబీన్‌కు గోల్డ్ మెడల్, ప్రశంసాపత్రాన్ని కలెక్టర్ అందజేశారు. ఈ సమావేశంలో డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు, డీఈవో ప్రణీత పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

కిక్కిరిసిన నాగోబా

నాగోబా దర్శనానికి బారులుదీరిన భక్తులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 15 : కేస్లాపూర్ నాగోబా దర్శనానికి భక్తులు తరలి వస్తున్నారు. రద్దీ పెరగడంతో జాతర పరిసరాలు కిక్కిరిసిశాయి. గంటల తరబడి బారులుదీరి నాగోబాను దర్శించుకుంటున్నారు. దుకాణాలు, రంగుల రాట్నుల వద్ద ప్రజలు కిక్కిరిశారు. ఆలయ అభివృద్ధికి మెస్రం వంశీయుల ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విరాళాలను సేకరిస్తున్నారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో రెండు 108 వాహనాలు ఏర్పాటు చేశారు. వైద్య శిబిరం ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారు. సీసీ కెమెరాలతో నిఘా పెంచారు. అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పోలీసు శాఖతో ముందుస్తు చర్యలు తీసుకున్నారు.

బుడుందేవ్‌కు పూజలు

మెస్రం వంశీయులతో కలిసి పూజలు నిర్వహిస్తున్న ఎంపీపీ

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 15 : శ్యాంపూర్ గ్రామంలోని బుడుందేవ్ దేవతకు మెస్రం వంశీయులు పూజలు నిర్వహించారు. బుధవారం కేస్లాపూర్ నుంచి శ్యాంపూర్‌కు ఎడ్లబండ్లు, కాలినడకన చేరుకుని మర్రి చెట్టు కింద బస చేశారు. గురువారం అత్యంత పవిత్రంగా సంప్రదాయ వాయిద్యాలు, గంగాజలం, నైవేద్యంతో పూజలు చేశారు. బుడుందేవ్(ఎద్దు) అత్యంత ప్రాధాన్యత కలిగిన దేవుడిగా కొలుస్తారు. శుక్రవారం నుంచి జాతర ప్రారంభం కానుంది. అదేవిధంగా ఎంపీపీ జైవంత్‌రావు, మెస్రం వంశీయులతో కలిసి పూజలు నిర్వహించారు.